

# అబ్బునాధం అచ్చుకండూతి

ఫెడేల్‌మని తలుపు తోసుకుని గదిలో ప్రవేశించాడు అబ్బునాథం- ఒక చేతిలో ఫ్లాస్కు, మరో చేతిలో సగం తెరచిన 'చంద్రవంక' వార పత్రికతో. వస్తూనే పత్రిక నేలకేసి కొట్టి "ఏమిటిది ?" అంటూ గర్జించాడు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతని రూంమేట్ సుబ్బతాత అదిరి పోయాడు. నెమ్మదిగా పక్కనే పడిన పత్రికను తీసి చూశాడు.

ఆశ్చర్యం ! తను మొదటిసారిగా రాసిన 'గుడ్డి వాడు' అనే కథ అచ్చయింది. బోలెడు సంతోషంతో "హార్రె ! నా కథ అచ్చయిందే !" అనేశాడు.

"మిత్రద్రోహి !" అని అరచాడు అబ్బునాథం.

"ఏమిట్రోయ్ దూర్వాసుడా ?" అర్థంకాక నవ్వుతూ అడిగాడు సుబ్బతాత.

"చండాలుడా ! రాక్షసుడా ! పాపీ ! వంచకుడా ! మోసగాడా ! అబద్ధాలకోరా" గెంతుతున్నాడు అబ్బునాథం.

అబ్బునాథం ప్రవర్తన మరీ అయోమయంగా ఉంది సుబ్బతాతకు.

"విషయ మేమిటో చెప్పకుండా అలా గెంతుతావే వేరా అప్పలసామీ?" విసుక్కున్నాడు సుబ్బతాత.

"నువ్వింత గోముఖ వ్యాఘ్రానివనీ, మేక వన్నె పులివనీ, పయోముఖ విషఃకుంభానివనీ తలచ లేదురా సుబ్బిగా."

"ఒరే ఉగ్రనరసింహం ! నీ గొడవ నాకే సర్థం కావడంలేదురా ! జ్వరపీడితుణ్ణి. నామీద దయవుంచి ఆ కాఫీ నా ముఖాన పోసి నన్ను రక్షించరా" అని వేడుకున్నాడు సుబ్బతాత.

"కాఫీయా !?! ఛీ ! ఇప్పటికే పాలుపోసి పామును పెంచి సర్పదష్టుడ నయ్యాను".

"ఈ చచ్చినాడికి కంఠతా వచ్చినవన్నీ నామీద ప్రయోగించి నా ప్రాణాలు తీస్తున్నాడేం ?" అను కున్నాడు సుబ్బతాత.

"కుంపట్లో ఏకులు దాచుకున్నట్లూ, కొరివితో తల గోక్కున్నట్లూ అయింది నాకు," అంటూ తలపట్టుక్కూర్చున్నా డబ్బునాథం.

"నాకీ జ్వరం తగ్గిపోతే బావుణ్ణు ! వెధవని గుండు గొరిగించి నిమ్మకాయలు రుద్ది యీ పైత్యం దింపేద్దును" అని ముచ్చటపడ్డాడు సుబ్బతాత తనలో.

"ఇంత జిత్తులమారి నక్కవనీ, తేనెపూసిన కత్తివనీ నే నెప్పుడూ అనుకోలేదురా సుబ్బాయ్" అన్నాడు అబ్బునాథం పళ్లు పటపట లాడిస్తూ.

"ఒరేయ్ విశ్వామిత్రం ! నేనేం చేశానురా ? నేనేదన్నా తప్పుచేస్తే క్షమించరా ! అసలు విషయం చెప్పరా !" అంటూ కాళ్లబేరానికి దిగాడు సుబ్బతాత.

గభాల్న వంగి, పత్రిక లాక్కుని "ఇదేమిట్రా?" అని ప్రశ్నించాడబ్బునాథం— పుస్తకంమీద చేత్తో కొడూ్తూ.

"నేను రాసిన కథ ....."

"అది సరేనోయ్ అమ్మమ్మా ! ఇదేమిటంటా ?"

"నా పేరు !"

"మరి నా పేరేం చేశావ్ ? అని అడుగుతున్నా!" తా డెత్తున లేచా డబ్బునాథం.

"నీపే రేమిట్రోయ్ శరభయ్యలింగం ? నేను రాసిన కథకి ?"

"ఆ ! అందుకేరా ! నువ్వు తుచ్ఛుడవై, అబద్ధాలకోరువై దేవుణ్ణి, దేవుడి ఎదుట చేసిన ప్రమాణాన్నీ ధిక్కరించావు అంటున్నా. అర్థమైందా ?" వికటంగా ప్రశ్నించా డబ్బునాథం.

నోరెత్తలేకపోయాడు సుబ్బతాత. కొద్దిగా గతంలోకి తొంగిచూస్తే అబ్బునాథం మాట నిజమే నేమో ననిపించింది.

"ఏం ? నువ్వు కథ రాస్తే నీ పేరుతోబాటు నాపేరు కూడా రాయగూడదా ? నా పేరంత విష మైందా ? నేనంత పనికిరాని వాణ్ణయానా నీకు ?" అబ్బునాథం తుఫానులాగా చెలరేగాడు.

"ఒరే అబ్బునాథం ! నువ్వు మీ అక్కయ్య పెళ్లి కెళ్లినప్పుడు ఏం తోచక ఈ కథ రాశాన్రా ? నువ్వు లేకపోవడంవల్ల ...." ఏదో ఒకవిధంగా తన దోషాన్ని కప్పిపుచ్చుకోవాలని సుబ్బతాత తాపత్రయం.

అబ్బునాథం అంత తేలిగ్గా వదుల్తాడా ! చెడా మడా దులిపేశాడు—

"ఆహా ! ఇదేమన్నా దస్తావేజా ? ప్రామిసరీ నోటా నాయనా నేనుండి సంతకం పెట్టడానికి ? బండెడు మురికిగుడ్డలు విడిచి నువ్వు మీవూరెళ్లి నప్పుడు నువ్వు లేవని నీ బట్టలు చాకలాడి కెయ్యడం మానానా ? నా పద్దుతోబాటు నీ పద్దు కూడా రాశానే ! ఆమాత్రం విశ్వాసం లేదన్న మాట ?!" అని.

"అది కాదురా! నీపేరు రాయడం మర్చిపోయాను" తన ప్రయత్నం మానలేదు సుబ్బతాత.

"మర్చిపోతావురా నువ్వూ ! మర్చిపోవూ ? ....

పెండ్యాల నాగాంజనేయులు

అసలెందుకు రాశావురా యీ కథ ?" అబ్బనాథం అడ్డు ప్రశ్న.

"ఏం లేదురా ! ఏమీ తోచకా .... కాస్త డబ్బు మీద ఆశ పుట్టీను."

"ఎందుకురా ఇన్నబద్ధాలు ? ఏం డబ్బులేక చస్తున్నావా ? నెలయ్యేసరికి ఇంటినుంచి వంద రూపాయలూ వస్తూనే ఉన్నాయిగా ! ఇంకా తక్కువైతే నన్నడుగుతూనే ఉన్నావుగా ?"

"ఎబ్బీ ! నిజంగారా ! నామాట నమ్ము ! డబ్బు కోసమే .... "

"కా .... దు. మళ్ళీ వాగావంటే ముమ్మారు చెప్తాను. కాదు ! కాదు ! కాదు" అబ్బనాథం మూర్ఖత్వం చూస్తే నవ్వొచ్చింది సుబ్బతాతకు.

"మరెందుకు రాశానుకుంటున్నావురా ?" అని ప్రశ్నించాడు చిరునవ్వుతో.

"అదీ నానోటే చెప్పిస్తావా ? పూ ! చెప్తా నయ్యా ! నీకు—నీ రచన, నీపేరు అచ్చులో చూసు కుని మురిసిపోవాలని దుర్బుద్ధి పుటింది. అవునా ?!" చేతులు తిప్పుతూ, గొంతెత్తి అరిచాడు అబ్బనాథం.

"చచ ! కాదురా" సమర్థించుకోబోయాడు సుబ్బతాత.

"వాగకు ! నాకు మళ్ళీ చిరాకు కల్గుతుంది! నీకు అచ్చు పిచ్చి పట్టింది. ప్రతి విషయంలోనూ వాతో భాగస్తుడవయ్యేవాడివి .... పేర్లు అచ్చు కొట్టించే విషయంలో స్వార్థపరుడి వయ్యావు. నీ ఒక్కడి పేరు అచ్చేయించుకున్నావు. అది చూసి నన్నేడుస్తూ కూర్చోమన్నావు" కుండ పగలగొట్టి నట్లు చెప్పాడబ్బనాథం.

"ఇప్పుడేం చెయ్యమంటావురా ?"

"చేసిన పాపానికి పశ్చాత్తాపపడు. ఆంజనేయ స్వామికి క్షమాపణ చెప్పుకో ! నా పేరుకూడా వెంటనే అచ్చేయించి పాపపరిహారం చేసుకో" ఉపాయం చెప్పాడు అబ్బనాథం.

"నీ పేరు వెంటనే అచ్చేయించడమంటే ..." అంటూ నీరసంగా లేవబోయాడు సుబ్బతాత.

"అంటే .... వెంటనే నాకో కథ రాసిపెట్టి, రచన : అబ్బనాథం అనే పేరుతో పత్రిక్కు పంపించు. పూ ! ఈ కథ పంపేసిన తర్వాత, ఇక మీద నువ్వు చెయ్యబోయే రచనలన్నీ "అబ్బ నాథం— సుబ్బతాత" అనే పేర్లతో పంపిద్దాం" సంబరపడ్డాడబ్బనాథం.

సుబ్బతాతకి ఆలోచన నచ్చలేదు.

"నేను రాయడ మేమి టా శోభనాచలపతీ ! నువ్వే ఏదన్నా రాసి పంపించు" అన్నాడు చెమ్మదిగా.

పళ్ళబిడ్డున్న అబ్బనాథం మళ్ళీ రేకెక్కాడు కొద్దిగా.

"అదుగో !......అందుకే నా పేరచ్చు పడకూడ దనే దుర్బుద్ధి నీకు కలిగిందే అన్నాను" అని మళ్ళీ నింద నోపాడు.

"అహః : నా ఉద్దేశ్యం..........." నసిగాడు సుబ్బతాత.

"ఇహ నోర్ముయ్ ! నేనెప్పుడన్నా కథలు రాయగా నువ్వు చూశావటా? అనుభవజ్ఞుడివి సన్యాసి ! నోర్మూసుకుని వచ్చినట్టు కథ రాసిపెట్టు" ఆజ్ఞాపించాడబ్బనాథం.

"ఇప్పుడేం కథ రాయనురా? అసలే జ్వరంగా వుంది. ఏం రాయాలో ఆలోచించొద్దూ?" తప్పిం చుకుందామని ప్రయత్నించాడు సుబ్బతాత.

"నువ్వేం రాశావు చెప్పు?"

"ఏదో గుడ్డివాడి కథ"

"అయితే నాకు కుంటివాడి కథ రాసిపెట్టు"

"కుంటివాడి కథేమిట్రా సహ్యనవాయం?"

"మరి గుడ్డివాడి కథేమిట్రా సర్వనాశనం?" నవ్వు, కొంచెం చిరాకూ కల్గాయి సుబ్బతాతకు.

"అబ్బ ! చంపుతున్నావురా ! ముందు కాస్త కాఫీ ఇవ్వరానక్షత్రకం. అసలే నీరసంగాకూడా ఉంది" మళ్ళా కాఫీకోసం దేబిరించాడు సుబ్బతాత. "ముందు కథ సంగతి తేల్చరా కాలకౌశికం ! తర్వాత కాఫీ ఏమిటి? రొట్టెకూడా వెన్న రాయించి పట్టుకొస్తా" కొంచెం ఆశ చూపించాడు అబ్బనాథం.

"ఏమిట్రా ఆనాహ్లా నీ మొండితనం? రోగం బాధపడ్తూంటే కాఫీకూడా ఇవ్వకుండా ఏడి పిస్తావ్?" జావగారిపోయాడు సుబ్బతాత.

"నేను కాఫీ ఇవ్వక కాసేపే ఏడిపించారా భగ వాన్లూ ! నువ్వున్నావే. నువ్వు......... నీ పేరు మాత్రం అచ్చేయించుకుని నన్ను శాశ్వతంగా ఏడిపిస్తున్నావ్ !" ఎత్తిపొడిచాడబ్బనాథం ప్రతి మాట వత్తి పలుకుతూ.

ఇహ లాభం లేదనుకున్నాడు సుబ్బతాత.

"సరేరా ! కాగితాలూ, కలం ఇలా తగలెయ్" అంటో లేచి కూర్చుని గోడ నానుకున్నాడు.

## అం దు కో ప చ్చు....

దాజకీయవాదివి కావాలంటే
రవ రవలు పుట్టించడం రావాలి !
మినిస్ట్రు వవాలంటే
మిడి మిడి జ్ఞానమన్నా కావాలి !

పదిమందిలో నీ పేరు
పలువూర్లు దొర్లిపోవాలి !
ఏ పేపర్లో చూసినా ——
ఏదో మూల నీపేరుండాలి !

అందుకు ముందుగా
అందరితలల్లో నాలుకలా
అహర్నిశలూ శ్రమించి
హుందాగా మెలగ్గలగాలి !

సర్టిఫికెట్లు ప్రసక్తే లేదు !
నేనుగొంతనుగూర్చున్నవ్యాసిస్తే చాలు ! !
కుంతం అనేది బాగుంటే ——
కలలన్నీ ఇట్టే ఫలిస్తాయి !

సైకొస్తున్నా డెవడో చూసి
పొదాభివందనం చేయాలి !
లక్షణ్ణించీ ఆతనికి ——
బాకాలా బహిరంగమవాలి.

అందరూ అసలు వాణ్ణి మర్చి
బాకానే బహు చక్కగా గుర్తిస్తారు !
అప్పుడు అసలు దశ ఆవిర్భవిస్తుంది
అందుతో ఆకాశా న్నందుకోవచ్చు ! !

—శ్రీనివాస కాశ్యప.

అబ్బనాథం తెచ్చిచ్చాడు.

"ఆ ! అంత అర్జెంటేం నాన్నగారూ ! ముందు 'కుంటివాడి కథ' అని హెడ్డింగు పెట్టండి"

పెట్టాడు తాత— కాఫీ ఇవ్వమని పంజ్ఞా చేసూ.........

"రచన అబ్బనాథం అని రాయరా !" అంటూ సుబ్బతాత నెత్తిన మొట్టాడబ్బనాథం.

అదీ రాశాడు సుబ్బతాత — "అబ్బ" అని తల తడుముకుంటూ.

చటుక్కున సుబ్బతాతని ప్రేమతో కౌగి లించుకుని, "మంచాడు మా సుబ్బినాన్న" అంటూ "ఒరేయ్ ! నానిగా ! ఇదిగో కాఫీ తాగి గబగబా కథ రాసెయ్. ఈలోగా నేను బజార్కెళ్ళి రెండు రొట్టెలు—వెన్న, జామ్ పులిమించి పట్టుకొస్తా ! ఏమ్మా !" అంటూ గ్లాసులో కాఫీ పోసి సుబ్బతాత ముందుపెట్టి పరుగెత్తుకపోయాడు అబ్బనాథం.

గుటుక్కున కాఫీ గొంతులో పోసుకుని, ఏం రాయాలో, ఎలా రాయాలో, కుంటివాడి కథేమిటో తెలియని సుబ్బతాత—

"దిక్కుమాలిన కథరాసి నా పీకలమీదికి తెచ్చుకున్నాను." అని విచారించి, నిట్టూర్చి, కాగి తాలన్నీ చెరగొట్టడం సాగించాడు.

* * *

ఒకళ్ళ ముక్కూ మొహం మరొకడికి తెలియ కుండా ఇద్దరూ ఇంటర్మీడియటులో క్లాస్‌మేట్సు అయ్యారు. వీడి ముక్కిలా ఉంటుంది. వీడి మొహ మిలా వుంటుంది,అని ఇలా మొదటి సంవత్సరంలో రెండో సంవత్సరం క్వార్టర్లీ పరీక్షలూ గడిచాక, ఎక్కిడ్డరికీ ఒక్క రోజునే రెగో కష్టమూ ఒచ్చి కూర్చుంది. ఏమిటీ ?! అబ్బనాథం ఉన్నఫళంగా రూం ఖాళీ చెయ్యాల్సి వచ్చింది. పోతే— సుబ్బతాత మానవేంద్ర ముఖర్జీ విరచిత శాన్సోర్టైట్ హిస్టరీ సంపాదించడానికి చేసిన కడసారి ప్రయత్నమూ ఖాళీ అయింది.

ఎప్పుడూ ఏడ ఉంటే, విచారించడానికి చీకటి ప్రదేశాలు అనువైనవి కాబట్టి, వీళ్ళిద్దరూ తెలుగు క్లాసుల్లో, చీకట్లో మరుగుపడిన ఆఖరు బెంచీల్లో మొదటిసారిగా ఒకరి పక్కనే మరొకరు కూర్చోడం తటస్థించింది. అప్పుడే ఒకళ్ళనొకరు పుకరించుకున్నారు. ఒకరి కష్టం మరొకరి చెవిలో వేసుకున్నారు ఒకరినొకరు ఓదార్చుకున్నారు. ప్రేమించుకున్నారు.

"మీకభ్యంతరం లేకపోతే నా రూములో మీరుండవచ్చు" అని కూశాడు సుబ్బతాత.

"అయితే నా హిస్టరీ నోట్సు మీరూ చదువు కోవచ్చు" అని పేలాడు అబ్బనాథం.

ఆ రోజు సాయంత్రమే కాలేజీ వదలగానే అబ్బ నాథాన్ని రూం ఖాళీచేయించి తన రూములో ప్రతి ష్టించాడు సుబ్బతాత.

వెంటనే ఇద్దరూ కలిసి తమ ఇష్ట దైవమైన ఆంజనేయస్వామి కోవెలకెళ్ళి "స్వామీ ! మేమిద్దరం ఒక రూములోనే ఉండి, పచ్చే ఒడుదుడుకులన్నీ, రాగే కష్టసుఖాల్నీ, పొందే సుఖసంతోషాల్నీ సమా నంగా పంచుకుంటూ ప్రాణానికి ప్రాణమై, మానానికి మానమై, దేహానికి దేహమై, మనసులో మనసై, నీడే నేనై, నేనే నీడై, ఈ ఇంటర్మీడియేట్ అనే సాగరాన్ని ఈదిస్తామని నీ ఎదుట ప్రమాణం

